సాక్షి ప్రకాశం

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



జగనన్న పాలనలో నిరంతర సంక్షేమం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నిరంతరం సంక్షేమం అందిందని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. - 8లో..



హీటెక్కిన గిద్దలూరు సీటు పోరు

గిద్దలూరు జనసేనలో వర్గపోరు ముదిరింది. ఆమంచి స్వాములు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని చెప్పడంతో పాటు జనసేన కార్యాలయాన్ని ప్రారంభించారు. - 13లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.4/27.4

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి గాలులు వీస్తాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది.

అరాచకమే అజెండా

అరాచకమే అజెండాగా ప్రతి ఎన్నికల వేళ దామచర్ల విధ్వంసకాండ సాగిస్తున్నారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. పోలీస్ వ్యవస్థను తన గుప్పెట్లో పెట్టుకుని నీచ రాజకీయాలు చేస్తున్నారు. కమ్మపాలెం ఘటన జరిగి ఐదేళ్లు గడిచిపోయాయి. ఆ నాటి ఘటనలో తప్పును వైఎస్సార్ సీపీ నేతలపై తోసేసి కేసులతో వేధించిన టీడీపీ నేత దామచర్ల జనార్దన్ అండ్ కో ఈ రోజు ఆ తప్పు మాదే అంటూ మీడియా సాక్షిగా అంగీకరించారు. మరి సమతానగర్ ఘటనపై వచ్చే ఎన్నికల నాటికి ఒప్పుకుంటారా అంటూ ఒంగోలు ప్రజలు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులకు కనువిప్పు కలుగుతుందా అని నగర ప్రజలు అడుగుతున్నారు.



ఒంగోలు కమ్మపాలెంలో బాలినేని శ్రీనివాసరెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు (ఫైల్)



వైఎస్సార్ సీపీ శ్రేణులపై చెప్పు విసురుతున్న టీడీపీ కార్యకర్త (ఫైల్)

- గత ఎన్నికల ముందు సమతానగర్ తరహాలో కమ్మపాలెం ఘటన
- ఐదేళ్ల తర్వాత తప్పు మాదే అంటూ అంగీకరించిన దామచర్ల
- ప్రజల్లో వ్యతిరేకత రావడంతో ఎన్నికల వేళ జనార్దన్ చిలుక పలుకులు
- నెపం నాయకులు, కార్యకర్తల మీదకు నెట్టివేత
- సమతానగర్ ఘటనపై నిజం 2029లో చెబుతారా?

ఒంగోలు సాక్షిప్రతినిధి: ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు తాత్కాలిక కార్యాలయాలు ప్రారంభించడం సర్వసాధారణం. 2019 ఎన్నికల సమయంలో ఒంగోలు నగరం కమ్మపాలెంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. ఆ నాడు ఎన్నికల వేళ అధికారాన్ని అడ్డం పెట్టుకుని దామచర్ల సాగించిన విధ్వంస దృశ్యాలు ఇప్పటికీ కళ్ల ముందు కదలాడుతున్నాయి. సరిగ్గా ఐదేళ్ల తర్వాత ఆ తరహాలోనే సమతానగర్‌లో జరిగింది. అయితే ఆ నాటి ఘటనలో తప్పు తమదే అంటూ దామచర్ల ఇప్పుడు మాట్లాడడం గమనార్హం. అసలు ఆరోజు ఏం జరిగిందంటే కమ్మపాలెంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. ఆ ప్రాంత నాయకుడు శ్రీహరి అన్ని ఏర్పాట్లు చేశారు. బాలినేని శ్రీనివాసరెడ్డిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. స్థానిక ట్రంకురోడ్డు నుంచి మస్తాన్‌దర్గా సెంటర్, కమ్మపాలెం కార్యాలయం వరకూ ఫ్లెక్సీలు సైతం ఏర్పాటు చేశారు. దీంతో టీడీపీ నేత, అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న దామచర్ల జనార్దన్ నేతృత్వంలో కుట్రలు మొదలయ్యాయి. తెల్లవారి చూస్తే ఫ్లెక్సీలు అన్నీ చింపివేశారు. అలాగే అక్కడ ఉన్న ఒక కారును సైతం ధ్వంసం చేశారు. దీంతో నగరంలో అలజడి రేగింది. కార్యాలయాన్ని సైతం ప్రారంభించకుండా పోలీసులను అడ్డంపెట్టుకుని ఆరాచకాన్ని సృష్టించారు. అప్పుడు సీఐలుగా ఉన్న గంగా వెంకటేశ్వర్లు, సుబ్బారావులు సైతం టీడీపీ వారికి పూర్తిగా సహకరించారన్న ఆరోపణలు వినిపించాయి. కార్యాలయాన్ని ప్రారంభించేందుకు బాలినేని కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. అప్పటికే పోలీసులు పెద్ద ఎత్తున మొహరించారు. ఇక్కడ కార్యాలయాన్ని ప్రారంభించడానికి వీల్లేదంటూ టీడీపీ వాళ్లు నానా హంగామా చేశారు. బాలినేనిని మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ కారు దియనీయకుండా దిగ్బంధం చేశారు. మరో వైపు దామచర్ల అనుచరులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారిని రెచ్చగొట్టేలా వ్యవహరించారు. డీజే బాక్సు లెక్కి తొడలు కొడుతూ కవ్వింపు చర్యలకు దిగారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా చేరుకుని ధర్నాకు దిగారు. పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ ఘటనకు సంబంధించి తెలుగుదేశం పార్టీ నేతలపై చిన్నచిన్న కేసులు పెట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు చుక్కలు చూపించి జైలు పాలు చేశారు. ఈ ఘటన నాడు సంచలనం రేకెత్తించింది. ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే తమ పరిస్థితి ఏమిటంటూ ప్రజలు ఆందోళన చెందారు.

నెపం నాయకులు, కార్యకర్తల మీద నెట్టివేత

ఇన్నేళ్ల తర్వాత దామచర్ల జనార్దన్ కమ్మపాలెం ఘటనపై మీడియా సాక్షిగా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కమ్మపాలెం ఘటన జరిగిన సమయంలో తాను విజయవాడలో ఉన్నానని, స్థానికంగా ఉంటే ఆనాడు ఆ పరిస్థితి తలెత్తేది కాదంటూ చెప్పుకొచ్చారు. కేవలం కమ్యూనికేషన్ గ్యాప్ కారణంగానే జరిగిందని, ఆ తప్పును నాయకులు, కార్యకర్తలపై తోసేశారు. సరిగ్గా ఐదేళ్ల తర్వాత అలాంటి సంఘటనే సమమతానగర్‌లో పునావృతం కావడంతో ప్రజలకు తన తప్పేమీ లేదని చెప్పుకునేందుకు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో కమ్మపాలెం ఘటన సమయంలో తానులేనంటూ సరికొత్త నాటకానికి తెరతీశారు. ఆ రోజు నగరంలో లేకపోతే వచ్చిన తర్వాతైనా అరెస్టులు ఆపాలని ఎందుకు చెప్పలేదు. జనార్దన్ చెప్పకుండా పోలీసులు అంత ఓవర్‌యాక్షన్ చేస్తారా? తప్పుడు కేసులు పెడుతుంటే ఎందుకు మౌనం వహించారు? వైఎస్సార్‌సీపీని బద్నాం చేసే కుట్రగాక మరేంటని? జనం చర్చించుకుంటున్నారు. నాటి వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు సింగరాజు వెంకట్రావును నాగులుప్పలపాడు పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లి హెచ్చరించి, రిమాండ్‌కు పంపే ముందు వైద్య పరీక్షలకు రిమ్స్ వద్దకు తీసుకువస్తే మీడియాను సైతం వీడియో తీయడానికి వీల్లేదంటూ బెదిరించిన నాటి పోలీసు అధికారి వ్యవహార శైలి మొత్తం అందరికీ గుర్తుంది.

నాటి కేసుల తీవ్రతపై నేడు కొనసాగుతున్న చర్చ:

కమ్మపాలెం ఘటనలో తానుంటే అలా జరిగేది కాదంటూ జనార్దన్ వివరణ ఇచ్చుకోవడంతో నాడు వైఎస్సార్‌సీపీ నాయకులపై పెట్టిన కేసుల్లో నిజమెంత అనే చర్చ తెరపైకి వచ్చింది. నాడు ఎవరి ప్రోద్బలంతో పోలీసులు రెచ్చిపోయారో చెప్పాల్సిన అవసరముంది. సమతానగర్ వివాదం కమ్మపాలెం ఘటనను తలపిస్తోంది. నాడు ప్రజాస్వామ్య పద్ధతిలో కార్యాలయాన్ని ప్రారంభించాలని వైఎస్సార్ సీపీ భావిస్తే దానిని రకరకాలుగా కుట్రలు పన్ని అడ్డుకుని ప్రజలను, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేశారు. నేడు ప్రశాంతంగా సమతానగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు శ్రీకావ్యను ఒక పథకం ప్రకారం అడ్డుకున్నారు. తమ పార్టీకి సానుభూతిపరుడిగా ఉన్న కానిస్టేబుల్ కుటుంబాన్ని ముందు పెట్టి హైడ్రామా సృష్టించారు. తిరిగి ఆ తప్పును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై తోసేస్తున్నారు. వీరికి ఎల్లోమీడియా తోడైంది. అసలు అక్కడ ఏం జరిగిందో వాస్తవాలను ప్రజలు చెప్పాల్సిందిపోయి టీడీపీ నాయకుల స్క్రిప్టులను అడ్డగోలుగా అచ్చేస్తూ అభాసుపాలవుతోంది. ప్రచారాన్ని అడ్డుకున్న క్షణాల్లోనే టీడీపీ నాయకులు అక్కడకు ఎలా చేరుకున్నారు అన్నది పరిశీలిస్తే ఈ ఘటన ఒక పథకం ప్రకారం జరిగిందనే చెప్పాలి. తాజాగా జరిగిన ఘటనలోనూ పోలీసులు వ్యవహరిస్తున్న తీరు పలు విమర్శలకు తావిస్తోంది. ఘటనకు కారకులను ఇంతవరకూ పట్టించుకోకపోవడం, ఈ కేసులో పోలీసులు చెబుతున్న అంశాలు సైతం విస్తుకలిగించేవిగా ఉన్నాయి. పోలీసులు ఎందుకు భయపడుతున్నారో ? అని జనం ప్రశ్నిస్తున్నారు. కమ్మపాలెం ఘటనలాగా సమతానగర్ వివాదంపై నిజాలను 2029 ఎన్నికలు సమయంలో జనార్దన్ చెబుతారేమోనన్న చర్చ జరగడం గమనార్హం.

జగన్‌పై దాడి అమానుషం

సాక్షి నెట్‌వర్క్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విజయవాడ సింగ్‌నగర్‌లో 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర చేసే సమయంలో రాయితో దాడిచేయడం టీడీపీ మూకల పనేనని జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ఇలా రాళ్లదాడులు చేయడం పిరికి పందల చర్య అన్నారు. రాళ్ల దాడి చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు.

- సీఎం జగన్‌పై రాళ్లదాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి అన్నారు. ప్రజల్లో జగన్ మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు. దాడులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి వచ్చే ఎన్నికల్లో లబ్ధిపొందాలనుకోవడం వట్టి భ్రమేనన్నారు.
- సీఎం వైఎస్ జగన్‌కి వస్తున్న ప్రజాభిమానాన్ని చూసి ఓర్వలేక కుట్రపూరితంగా దాడిచేశారని వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. విజయవాడలో సీఎంకు అపూర్వ స్వాగతం పలకడాన్ని టీడీపీ శ్రేణులతు జీర్ణించుకోలేకపోయాయన్నారు.
- సీఎం జగన్‌పై రాయితో దాడి చేయడం ప్రజాస్వామ్యంలో మంచిపద్ధతి కాదని గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు అన్నారు. అందరూ ఈ దాడిని ఖండించాలన్నారు. రాష్ట్రంలో ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని చెడగొట్టడం మంచిపద్ధతి కాదన్నారు.
- సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రోజు రోజుకూ పెరుగుతున్న ప్రజాభిమానాన్ని ఓర్వలేకే టీడీపీ అధినేత చంద్రబాబు రాళ్ల దాడులకు పాల్పడుతున్నాడని యర్రగొండపాలెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌ల అడ్రస్‌లు గల్లంతవుతాయన్నారు.
- సీఎం వైఎస్ జగన్‌కి ప్రజా క్షేత్రంలో వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేకనే చంద్రబాబు దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతున్నాడని కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. చంద్రబాబు, కూటమి నేతల ప్రోద్బలంతోనే సీఎంపై రాళ్ల దాడి చేశారన్నారు. ఇది పిరికి పందల చర్య అన్నారు.

అభివృద్ధి సంకల్పంతో పనిచేస్తాం

- దొంగకు దొంగ తోడు అన్నట్లుగా మాయ కూటమి తయారైంది
- మూడు జెండాల మాయ కూటమిని ప్రజలు నమ్మడం లేదు
- జగనన్న జెండా, అజెండా రాష్ట్ర ప్రజల అభివృద్ధే
- వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆదిమూలపు సురేష్
- పొన్నలూరులో కార్యకర్తల ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పక్కన మంత్రి సురేష్



పొన్నలూరు ఆత్మీయ సమావేశంలో భారీగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

పొన్నలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరిక మేరకు తాను ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా, కొండపి ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి సురేష్ పోటీ చేస్తున్నామని ఆదరించి ప్రజలు గెలిపిస్తే జిల్లాతో పాటు కొండపి అభివృద్ధికి సంకల్పంతో పనిచేస్తామని చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. పొన్నలూరులో శనివారం ఉప రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అధ్యక్షతన వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం, ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ ఆత్మీయ సమావేశంలో ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ సుమారు రూ.వెయ్యి కోట్లతో చంద్రగిరి నియోజకవర్గంలో 5096 అభివృద్ధి పనులు పూర్తిచేసి ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేశానన్నారు. అలాగే తనపై నమ్మకంతో జగనన్న ఒంగోలు ప్రాంతానికి పంపించారని, జిల్లా అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అధోగతిపాలైందన్నారు. ఇలాంటి సమయంలో జగనన్న ఐదేళ్ల పాలనలో అద్భుత పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరిచారన్నారు. దొంగకు దొంగ తోడు అన్నట్లుగా మాయ కూటమి పేరుతో చంద్రబాబు మూడు జెండాలతో వస్తుంటే, జగనన్న ఒకే జెండాతో ప్రజల అండదండలతో ముందుకు సాగుతున్నాడన్నారు. ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల అభివృద్ధే ప్రధాన లక్ష్యమని, ఈ ప్రాంత ప్రజల అభిమానం ఎప్పటికీ మర్చిపోనన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి...

మంత్రి సురేష్ విద్యావంతుడిగా మీలో ఒకడిగా కొండపికి వచ్చాడని, మీరందరూ ఆదరించి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలంగా ఉందని, గత ఎన్నికల్లో సమన్వయ లోపం వలన మనం ఓడిపోయాం తప్పా, టీడీపీ స్వతహాగా గెలవలేదన్నారు. ఎమ్మెల్యే స్వామి అహంకారంతో అగౌరవంగా మాట్లాడుతున్నాడని, అలాగే కులాల మధ్య చిచ్చుపెట్టి గెలవాలనుకోవడం సిగ్గుచేటన్నారు. మీరందరూ ఓట్ల రూపంలో ఎమ్మెల్యే స్వామిని ఓడించి తన అహంకారాన్ని దించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి సురేష్‌కి, ఎంపీ అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని చెవిరెడ్డి భాస్కరరెడ్డి అభ్యర్థించారు.

ఎమ్మెల్యే స్వామి అహంకారపూరిత మాటలు మానుకోవాలి...

కొండపి నియోజకవర్గ ప్రజలతో మూడు సార్లు ఓట్లు వేయించుకొని రెండు సార్లు గెలిచిన ఎమ్మెల్యే స్వామి ఈ ప్రాంత అభివృద్ధికి ఏమీ చేయకపోగా తన స్థాయి మరిచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అవాకులు చెవాకులు పేలుతున్నాడని మంత్రి సురేష్ అన్నారు. తమను వలస పక్షులుగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి తన అధినేత ఎక్కడ నుంచి ఎక్కడికి వచ్చి పోటీ చేశాడో గుర్తు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఎక్కడైనా పోటీచేసి ప్రజలకు సేవచేసే అవకాశం ఉంటుందన్నారు. అహంకార పూరిత మాటలు మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామికి ఇక్కడ ఎవరూ భయపడరని, స్వామి లాంటి పిచ్చుకలు ఎన్ని అరచినా ప్రజల ఆశీస్సులతో ఈ సారి కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామన్నారు. చంద్రబాబు వలంటీర్లపై అక్కసుతో వారిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి పింఛన్లు పంపిణీ చేయకుండా రాష్ట్రంలో 31 మందిని పొట్టన పెట్టుకున్నారన్నారు. తప్పక ప్రజలు మరోసారి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి జగనన్నకు అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు రాచగొర్ల పిచ్చయ్య యాదవ్, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు మన్నెం రవణయ్య, మాజీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, సిరిగిరి గోపాల్‌రెడ్డి, దాసరి రవి, యర్రా గోపాల్, ముప్పా కోటేశ్వరరావు, నవులూరి మధు, మన్నెం చిన వెంకటేశ్వర్లు, చేవూరి పద్మనాభరెడ్డి, కూనం బ్రహ్మారెడ్డి, కంచర్ల రమణయ్య, గొల్లపూడి రమణయ్య, గడ్డం మాల్యాద్రి, గడ్డం వీణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ విజయం సాధిస్తా..అవకాశం ఇవ్వండి

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



21వ డివిజన్ ఇందిరాకాలనీలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: మరొక్క అవకాశం ఇస్తే హ్యాట్రిక్ విజయం సాధించి నగర అభివృద్ధికి కృషి చేస్తానని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని 21 వ డివిజన్ పరిధిలోని ధారావారితోట, ఇందిరా కాలనీలో శనివారం 'మన ఒంగోలు–మన వాసన్న' కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాలినేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో జనరంజకంగా పాలన అందించారని కొనియాడారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పరిపాలన అందించారన్నారు. గత ఐదేళ్లలో ఒంగోలును ఎంతో అభివృద్ధి చేశానని, తాను చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా ఇళ్లు లేని నిరుపేదలైన గృహ లబ్ధిదారులకు 25 వేల ఇళ్ల పట్టాలు అందించానని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో గెలిపిస్తే ప్రతి ఒక్కరికీ ఇళ్లు కట్టిస్తానని భరోసా ఇచ్చారు. మరొక్క అవకాశం ఇస్తే మిగిలిన పనులు పూర్తి చేస్తానని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మళ్లీ బుద్ధి చెప్పాలని కోరారు. డివిజన్ పర్యటన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు బాలినేనికి ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చి టెంకాయతో దిష్టితీసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన వెంట టౌన్ అధ్యక్షుడు కఠారి శంకర్, కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షుడు యనమాల నాగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వే ట్రాక్‌పై గాయాల పాలైన వ్యక్తి మృతి

రాచర్ల: మండలంలోని యడవల్లి రైల్వేస్టేషన్ పరిధిలోని రైల్వే ట్రాక్‌పై శనివారం ఉదయం 8 గంటలకు 50 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఇది గమనించిన రైల్వే సిబ్బంది 108 వాహనంలో గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించగానే మృతి చెందాడు. మృతుడు నీలి రంగు టీషర్ట్, నలుపురంగు జీన్స్ ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు మార్కాపురం జీఆర్‌పీ హెచ్‌సీ శ్రీహరికృష్ణరెడ్డి సెల్ నంబర్ 77026 50514, నంద్యాల జీఆర్‌పీ ఎస్సై జలీల్ 94415 09497 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం ఏర్పాటు

ఒంగోలు అర్బన్: వేసవి నేపథ్యంలో జిల్లా ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఎక్కడైనా సమస్యలుంటే తెలిపేందుకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే పరిష్కారం కోసం ప్రజలు కంట్రోలు రూముకు ఫోన్ చేయాలని సూచించారు. కంట్రోలు రూము ఫోన్ నంబర్ 91001 21605కు ఫోన్ చేస్తే తాగునీటి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

దర్శి గ్లాసులో అంతర్మథనం..!

- జనసేనలోని కాపునకు దక్కాల్సిన సీటు టీడీపీలోని కమ్మకు కేటాయింపు
- జనసేన ఇన్‌చార్జ్‌గా కూడా కాపును తొలగించి కమ్మకు అప్పగింత
- జనసేన ముసుగులో నారా లోకేష్ సన్నిహితుడైన కమ్మ నాయకుడే ఇన్‌చార్జి
- ఇన్నాళ్లూ ఖర్చుపెట్టుకుని పార్టీ కార్యక్రమాలు చేసి మోసపోయిన స్థానిక కాపు నాయకులు
- మొండిచేయిపై మండిపడుతున్న కాపులు, జనసేన శ్రేణులు
- టికెట్ ఇవ్వకపోగా, ఇన్‌చార్జిని కూడా మార్చివేసి కాపులను చంద్రబాబు తొక్కేశాడంటూ ఆగ్రహం



దర్శి: టీడీపీ, జనసేన పొత్తు రాజకీయాలు దర్శి నియోజకవర్గంలోని ఆయా పార్టీల మధ్య కుంపటి రాజేశాయి. పొత్తులో భాగంగా జనసేన తరఫున కాపులకు దక్కాల్సిన దర్శి ఎమ్మెల్యే టికెట్‌ను నారా చంద్రబాబు, లోకేష్‌లు కుటిల రాజకీయంతో టీడీపీలోని కమ్మకు కేటాయించడంపై జనసేన పార్టీ శ్రేణులు, కాపులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవిలో కూడా కాపును పక్కనపెట్టి లోకేష్ సన్నిహితుడైన కమ్మవారికి అప్పగించడంపై ఆ రెండు పార్టీలు, ఆ రెండు సామాజికవర్గాల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలకు తావిచ్చింది. జనసేన కోసం ఏళ్ల తరబడి పార్టీ కార్యక్రమాలు నిర్వహించి డబ్బు ఖర్చుపెట్టుకున్న కాపు నాయకులకు టీడీపీ అధిష్టానం అన్యాయం చేసి మొండిచేయి చూపడంపై కాపులు, జనసేన పార్టీ శ్రేణులు మండిపడుతున్నారు.

దీర్ఘాలోచనలో జనసేన కిందిస్థాయి కేడర్...

దర్శి నియోజకవర్గంలోని కాపులు, కాపు నాయకులు మొదటి నుంచి ప్రజారాజ్యం, ఆ తర్వాత జనసేన పార్టీలో కొనసాగుతూ వచ్చారు. జిల్లాలో జనసేన పార్టీకి ఆదరణ ఉన్న నియోజకవర్గాలలో మొదటిది గిద్దలూరు కాగా, రెండోది దర్శి. ఈ రెండిట్లో ఒక్కచోటైనా కచ్చితంగా జనసేనకు టికెట్ వస్తుందన్న ఆశాభావంతో ఉన్న కాపులపై చంద్రబాబు ఎత్తుకు పైఎత్తులు వేశారు. అనుకున్న విధంగానే కాపులను, జనసేన పార్టీని చిత్తు చేశారు. దీంతో జిల్లాలో కనీసం ఒక్క సీటు కూడా కాపులకు ఇవ్వకపోతే జనసేన పార్టీకి ఇక పుట్టగతులు ఉండవనే అంతర్మథనంలో ఆ పార్టీ నేతలు ఉన్నారు. గాజు గ్లాసుకు ఈసారైనా ఓటేద్దామనుకున్న ఆ పార్టీ కేడర్‌కు చంద్రబాబు దారుణంగా వెన్నుపోటు పొడిచారు. ఎవరు అవునన్నా.. కాదన్నా ఇవన్నీ నిజాలే. నిజాలు కళ్లముందు కనిపిస్తున్నా ఏం చేయలేని నిస్సహాయస్థితిలో ఆ పార్టీ కేడర్ ఉంది. అయితే, జనసేన పార్టీకి జరిగిన అన్యాయాన్ని ఆ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇంత అన్యాయం చేసిన టీడీపీకి తమ మద్దతు తెలపాలా..వద్దా..? అనే ఆలోచనలో పడ్డారు. అసలు టీడీపీకి మద్దతిస్తున్నందుకు వారు జనసేనకు చేస్తున్న మేలు ఏంటనే ఆలోచనలో పడ్డారు. ఓట్లు వేసేది మేమే.. బ్యానర్లు, ఫ్లెక్సీలు కట్టేది మేమే.. కార్యక్రమాల్లో పాల్గొనేది మేమే.. కానీ, మాకు తెలియకుండానే పైస్థాయిలో ఇంత కుట్ర జరుగుతుంటే టీడీపీకి ఎలా మద్దతు తెలపాలనే అంతర్మథనంలో జనసేన కేడర్ ఉంది. రేపోమాపో జనసేన పార్టీ నేతలు కూడా ఓ నిర్ణయానికి రానున్నారు.

జనసేనను నిర్వీర్యం చేయాలని చంద్రబాబు కుట్ర...

దర్శిలో జనసేన పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేయాలని చంద్రబాబు కంకణం కట్టుకున్నారు. అందులో భాగంగా చాపకింద నీరులా తన పార్టీలోని తన సామాజిక వర్గానికి చెందిన సన్నిహితుడు గరికపాటి వెంకట్‌ను జనసేనలోకి పంపారు. జనసేన ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు పార్టీని కనిపెట్టుకుని ఉన్న స్థానిక కాపు సామాజికవర్గానికి చెందిన నాయకుడు బొటుకు రమేష్‌బాబుకు తనదైన స్టైల్‌లో వెన్నుపోటు పొడిచారు. ఇన్‌చార్జ్‌గా రమేష్‌బాబును తప్పించి కమ్మ సామాజిక వర్గానికి చెందిన గరికపాటి వెంకట్‌కు ఇన్‌చార్జ్ పదవి కట్టబెట్టారు. అందుకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి పావులు కదిపారు. ముందస్తు ప్లాన్ ప్రకారం కాపులను తీసేసి కమ్మవారికి జనసేన ఇన్‌చార్జ్ పదవి కట్టబెట్టించడమే కాకుండా కాపులకు దక్కాల్సిన దర్శి ఎమ్మెల్యే టికెట్‌ను కూడా తన సామాజికవర్గం, తన పార్టీకి చెందిన గరికపాటి లక్ష్మికి దక్కేలా చేశారు. అందుకోసం ఐవీఆర్ఎస్ సర్వేల పేరుతో బురిడీ కొట్టించారు. ఇక్కడ కాపు సామాజికవర్గానికి చెందిన వరికూటి నాగరాజు కూడా గత నాలుగేళ్ల నుంచి దర్శి జనసేన టికెట్ తనకేనని తిరుగుతున్నాడు. టికెట్ తెచ్చుకోలేకపోగా, కనీసం ఇన్‌చార్జ్ పదవి కూడా దక్కించుకోలేక బొక్కబోర్లాపడ్డాడు. దీంతో కాపుల్లో నైరాశ్యం మరింత పెరిగింది.

తాము కూలీలమా అంటున్న జనసేన కాపులు...

జనసేనకు, కాపులకు టికెట్ ఇవ్వలేదని కొందరు జనసేన నాయకులు గుర్రుగా ఉన్నారు. టీడీపీ నాయకులు తమను జెండాలు మోసే కూలీలుగానే చూస్తున్నారు తప్ప కనీస విలువ ఇవ్వడం లేదని తెలుసుకున్నారు. గత 10 సంవత్సరాలుగా టీడీపీకి దీటుగా జనసేన పార్టీ కేడర్ కూడా ఫ్లెక్సీలు కట్టడం.. తిరునాళ్లకు ప్రభల ఏర్పాటు, ఇతర పార్టీ కార్యక్రమాలు చేస్తోంది. దీంతో వారు కూడా భారీగా ఖర్చుచేసుకుని తీవ్రంగా నష్టపోయారు. ఈ తరుణంలో తమను జనసేనలో ఆర్థికంగా ఆదుకునే నాయకుడు వస్తాడని ఆశగా ఎదురుచూశారు. చివరకు టీడీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా వచ్చిన గొట్టిపాటి లక్ష్మి కూడా వారికి సపోర్ట్ చేయలేదు. ఈ విషయాన్ని ఇటీవల అప్పటి జనసేన ఇన్‌చార్జ్ బొటుకు రమేష్‌బాబు వద్ద కుండబద్దలు కొట్టారు. దీంతో రమేష్‌బాబు తమ కేడర్‌ను కూడా ఆదుకోవాలని టీడీపీని కోరారు. అందుకు బహుమతిగా అతన్ని ఇన్‌చార్జిగా తొలగించి కమ్మ సామాజికవర్గానికి చెందిన లోకేష్ సన్నిహితుడైన గరికపాటికి జనసేన ఇన్‌చార్జ్ పదవి కట్టబెట్టారు. ఈ విషయం దర్శి నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. స్థానికులుగా ఉన్న బొటుకు రమేష్‌బాబు, వరికూటి నాగరాజును కాదని గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన స్థానికేతరుడు, కమ్మ సామాజికవర్గానికి చెందిన గరికపాటికి ఇన్‌చార్జ్ పదవి ఇవ్వడం జనసేన కేడర్‌కు, కాపులకు మింగుడు పడటం లేదు. ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోగా, జనసేన ఇన్‌చార్జి పదవికి కూడా తమను దూరం చేయడంపై కాపులు రగిలిపోతున్నారు.

తాగునీరు పక్కదారి పట్టకుండా చర్యలు



అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ జాన్ ఎర్విన్

కురిచేడు: జిల్లా ప్రజల దాహార్తి తీర్చేందుకు విడుదలైన సాగర్ జలాలు పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కనిగిరి ఆర్డీఓ పాలపర్తి జాన్ ఎర్విన్ హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన శనివారం దర్శి, కురిచేడు నీటి రిజర్వాయర్లను, పంపింగ్ విధానాన్ని ఆయన పరిశీలించారు. సాగర్ కాలువపై ఎక్కడెక్కడ నీటి చౌర్యం జరుగుతుందో అక్కడ పెట్రోలింగ్ ద్వారా నిఘా ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీసులతో టీంలు ఏర్పాటు చేసి కాలువపై పహారా కాయాలని ఆదేశించారు. దర్శి బ్రాంచి కాలువపై పమిడిపాడు బ్రాంచి, బయ్యవరం, పులిపాడు మేజర్లతో పాటు మెయిన్ కాలువపై ఉన్న ఐనవోలు మేజరుపై కూడా పహారా ఏర్పాటు చేశారు. కురిచేడులోని అట్లపల్లి రిజర్వాయరు, దర్శిలోని కనిగిరి, దర్శి ఎస్‌ఎస్‌పీ స్కీమ్‌లు పరిశీలించారు. జనరేటర్ల పనితీరు గురించి ఆరా తీశారు. తాగునీటి చెరువులు నింపిన తర్వాత పశువుల దాహార్తి తీర్చేందుకు నాన్‌నోటి ఫైడ్ చెరువులకు నీరు ఇస్తామని తెలిపారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, ఇరిగేషన్ డీఈ బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామి, ఎస్‌ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఫేక్ పార్టీ.. ఫేక్ వార్తలు



పోతలపాడు వైఎస్సార్ సీపీ వారు టీడీపీలో చేరారంటూ ప్రచారం చేసుకుంటున్న నేతలు

- సొంత పార్టీ నేతలకే కండువా కప్పి చేర్చుకుంటున్న టీడీపీ నేతలు

తర్లుపాడు: టీడీపీ నేతల ఫేక్ ప్రచారం శృతి మించిపోతోంది. అదే పార్టీకి చెందిన వారిని వైఎస్సార్ సీపీ కార్యకర్తలుగా చూపుతూ వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్లు అసత్య వార్తలు ప్రచారం చేస్తున్నారు. అలాగే నలుగురికి కండువాలు కప్పి.. 40 కుటుంబాలు టీడీపీలో చేరాయంటూ అనుకూల పచ్చపత్రికలు, సోషల్ మీడియా గ్రూపుల్లో హంగామా చేస్తున్నారు. మండలంలో ఇటీవల కాలంలో చేజారిపోతున్న తమ టీడీపీ కార్యకర్తలను నిలుపుకునేందుకు వేస్తున్న పచ్చనేతల ఎత్తుగడ నవ్వుల పాలు చేస్తోంది. సొంతపార్టీ వారికే పార్టీ కండువాలు కప్పి సోషల్ మీడియా ప్లాట్ ఫాంపై ఆహా... ఓహో.. అంటూ ప్రచారం చేసుకుంటున్న తీరును ఓటర్లతోపాటు సొంత పార్టీ నాయకులే విమర్శిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ బలపరిచిన 16కు 16 మంది గ్రామ సర్పంచ్‌లు, 10కి 10 ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, నామినేటెడ్ పదవులతో పార్టీ బలంగా ఉంది. దీంతో దిక్కుతోచని టీడీపీ వారు ప్రజలను ఏమార్చేందుకు శత విధాలా ప్రయత్నిస్తున్నారు. మార్కాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ అభ్యర్థి కందుల నారాయణ రెడ్డి వ్యవహారం మరోలా ఉంది. వైఎస్సార్ సీపీలోని రెడ్డి సామాజికవర్గం నేతలను కలిసి మనమంతా ఒకే కులానికి చెందినవారమని మద్దతు కోరుతున్నారు. అదే సమయంలో అదే సామాజిక వర్గానికి చెందిన ఆ పార్టీ మండలాధ్యక్షుడు పేట్రేగి పోతున్నారు. వైఎస్సార్ సీపీలోని రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేతలను టార్గెట్ చేస్తున్నారు. వారిపై అక్రమంగా ఫిర్యాదులు చేయడం, కేసుల్లో ఇరికిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. శుక్రవారం రాత్రి పోతలపాడులో టీడీపీ ముఖ్యనేత కుమారుడు ఎన్నికల ప్రచారానికి వచ్చి తమ సొంత పార్టీ వారికే కండువాలు వేసి టీడీపీలో చేరినట్లు ప్రచారం చేయడంపై గ్రామ వైఎస్సార్ సీపీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

జగనన్న పాలనలో నిరంతర సంక్షేమం



మంత్రి మేరుగు నాగార్జున ప్రచారంలో పార్టీ జెండాలతో భారీగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

- ఆయనను మళ్లీ సీఎం చేసుకుందాం
- అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైఎస్సార్ సీపీకి ఓటేయండి
- మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలించిన గత ఐదేళ్లలో ఎక్కడా విరామం లేకుండా సంక్షేమ పథకాలను నిరంతరం అందించారని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. శనివారం చీమకుర్తి పట్టణంలోని 20వ వార్డులో స్థానిక కౌన్సిలర్ గంగిరెడ్డి ఇందిర సుందరరామిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే పేదలకు ఇప్పుడొస్తున్న సంక్షేమ పథకాలన్నీ వస్తాయన్నారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రాగానే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలోని ఓటర్లకు అందుబాటులో ఉంటానని, స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేసి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు పనిచేయాలని, వారందరికీ అండగా ఉంటానని తెలిపారు.

అదే ఆప్యాయత, అదే పలకరింపు...

మంత్రి మేరుగు నాగార్జున ఓటర్లు, మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ఆకట్టుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి నియోజకవర్గంలో ప్రచారం మొదలు పెట్టి అదే ఒరవడి కొనసాగిస్తూ పార్టీ కార్యకర్తలు, నాయకులను కలుపుకుంటూ దూసుకుపోతున్నారు. దీంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం పెరిగి ప్రత్యర్థి పార్టీల్లో ఆందోళన కలిగిస్తోంది. చీమకుర్తి పట్టణంలోని 20వ వార్డులో మంత్రి మేరుగు ప్రచారం చేసిన ప్రతిచోటా స్థానిక ఓటర్లు, కౌన్సిలర్లు హారతులతో స్వాగతం పలుకుతూ శాలువాలు కప్పి సన్మానించారు. తమ ఓటు వైఎస్సార్ సీపీకేనని మంత్రి మేరుగు నాగార్జునకు ఆనందంగా చెప్పడం చూస్తుంటే వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని తెలుస్తోంది. భారీగా పార్టీ జెండాలతో కార్యకర్తలు ప్రతి వీధిలో మంత్రి మేరుగు నాగార్జునతో కలిసి తిరుగుతూ వైఎస్సార్ సీపీకి చెందిన ఫ్యాన్ గుర్తును చూపిస్తూ సంఘీభావం తెలిపారు. సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, బాపట్ల ఎంపీగా నందిగం సురేష్‌ను గెలపించాలని మంత్రి మేరుగు నాగార్జున ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మంత్రి తనయుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం బాపట్ల జిల్లా కన్వీనర్ మేరుగు చందన్‌నాగ్, పార్టీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, స్థానిక కౌన్సిలర్ గంగిరెడ్డి ఇందిర సుందరరామిరెడ్డి, పట్టణ కౌన్సిలర్లు తప్పెట బాబూరావు, పాటిబండ్ల గంగయ్య, నలమల మాణిక్యం, గోపురపు చంద్ర, ఆముదాలపల్లి రామబ్రహ్మం, జేసీఎస్ కన్వీనర్ మంచా హరికృష్ణ, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, పాలడుగు సుబ్బారావు, నలమోలు మోహన్, స్థానికులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్ సస్పెండ్



ఆర్డీవో వద్ద టీడీపీ నాయకులను బైండోవర్ చేస్తున్న పోలీసులు

ఒంగోలు: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ శనివారం రాత్రి ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ నెల 10న వైఎస్సార్ సీపీ నాయకులు సమతానగర్ ఒకటో లైను వద్ద ఎన్నికల ప్రచారం చేస్తుండగా, టీడీపీ వారితో ఘర్షణకు దారితీసి పలువురు హాస్పిటల్ పాలయ్యారన్నారు. ఈ ఘటనలో వైఎస్సార్ సీపీకి చెందిన సుజనప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైం నంబర్ 228/2024 కింద టీడీపీకి చెందిన 36 మందిపై 143, 147, 188, 324 రెడ్‌విత్ 149 ఐపీసీ సెక్షన్లు, 3(1)(ఆర్), 3(1)(ఎస్), 3(2)(5ఎ) ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్టు కింద కేసు నమోదు చేశారు. టీడీపీ వారి ఫిర్యాదు మేరకు వైఎస్సార్ సీపీకి చెందిన 31 మందిపై క్రైం నంబర్ 229/2024 అండర్ సెక్షన్స్ 143, 147, 323, 324, 354, 506, 188 రెడ్ విత్ 149 ఐపీసీ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఒంగోలు దిశ డీఎస్పీ శ్రీనివాసరావు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా సమగ్ర దర్యాప్తు చేపట్టి ప్రాథమిక వాస్తవాలు, సాంకేతిక పరిజ్ఞానం, వీడియోలు, కాల్ డేటా వివరాల ఆధారంగా వైఎస్సార్ సీపీకి చెందిన 17 మంది వ్యక్తులను, టీడీపీకి చెందిన ఇద్దరిని గుర్తించి 41(ఎ) సీఆర్‌పీసీ నోటీసులు (అర్నేష్ కుమార్ వర్సెస్ బీహార్ స్టేట్) కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఇచ్చినట్లు వివరించారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని, ఇంకొంతమందిని గుర్తించి వారికి నోటీసులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ ఘటనలో నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ కేసులో ప్రమేయం ఉన్న ఏఆర్ పీసీ 1893 ఎం.లక్ష్మీనారాయణ(పీటీసీ)ని సస్పెండ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

అదేవిధంగా రిమ్స్ ఆస్పత్రిలో జరిగిన ఘటనకు సంబంధించి డ్యూటీ డాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరుపార్టీలకు చెందిన వారిపై ఒంగోలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో క్రైం నంబర్ 96/2024, అండర్ సెక్షన్స్ 143, 147, 353, 427, 506, 188 రెడ్ విత్ 149 ఐపీసీ, ప్రివెన్షన్ ఆఫ్ డ్యామేజ్ టు పబ్లిక్ ప్రాపర్టీ యాక్టు కింద చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్ ప్రత్యేక దర్యాప్తు అధికారితో ఇరుపార్టీలకు చెందిన వందమందిని గుర్తించడం జరిగిందన్నారు. అందులో వైఎస్సార్ సీపీకి చెందిన 23 మంది, టీడీపీకి చెందిన 21 మందికి 41(ఎ) సీఆర్‌పీసీ నోటీసులు అందించడం జరిగిందన్నారు. మొత్తంగా వైఎస్సార్ సీపీకి చెందిన 36 మంది, టీడీపీకి చెందిన 15 మందిని ఒంగోలు ఆర్డీవో వద్ద హాజరుపరిచి 6 నెలలపాటు మంచి ప్రవర్తన కోసం 5 లక్షల పూచీకత్తు బాండ్లతో ఆర్డీవో బైండోవర్ చేశారు. విచారణను ప్రభావితం చేసేలా వాస్తవ దూరమైన, నిరాధారమైన వార్తలను వ్యాప్తి చేయరాదని ప్రజలకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కేసులకు సంబంధించి ఎవరికైనా, ఏదైనా సమాచారం, సాక్ష్యాలు ఉంటే వెంటనే విచారణ అధికారులు అయిన దిశ డీఎస్పీ, చీమకుర్తి సీఐకి తెలియజేయాలన్నారు. ఈ కేసుల్లో ఇంకా చాలామంది ట్రబుల్ మాంగ్లర్స్/దుందుడుకు చర్యలకు పాల్పడేవారిని గుర్తించి వారిని బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు శాంతికి ఎలాంటి భంగం కలగకుండా ప్రవర్తించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూ.చా. తప్పక పాటించాలన్నారు. ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి అల్లర్లు సృష్టించినా, గొడవలు ప్రేరేపించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

అగ్ని ప్రమాదంలో పూరి గుడిసె దగ్ధం

- రూ. 2 లక్షల ఆస్తి నష్టం

పీసీపల్లి: మండల పరిధిలోని నేరేడుపల్లి ఎస్సీ కాలనీలో అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన గుండా బత్తిన మాలకొండయ్య కట్టెల పొయ్యిపై అన్నం వండుతుండగా అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇంటిలోని సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. హుటాహుటిన సమాచారం అందుకున్న ఫైర్ అధికారులు మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు 2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని, దాతలు ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ అధికారులు